క్లుప్తంగా

మనస్తాపంతో ఒకరి ఆత్మహత్య

బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రంలో నివాసం ఉంటున్న నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలం లోకల్ వెల్మల్ గ్రామానికి చెందిన సుంకరి పోశెట్టి(43) సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. పాత సామాను ఏరుకొని జీవనం సాగించే పోశెట్టి భార్య నాలుగేళ్ల క్రితం చనిపోయింది. దీంతో బాల్కొండకు చెందిన నక్క పోసానితో సహజీవనం చేస్తున్నాడు. ఆదివారం ఇద్దరి మధ్య గొడవ జరగడంతో పోసాని ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. మనస్తాపం చెందిన పోశెట్టి దులానికి ఉరి వేసుకున్నాడు. మృతుడి కూతురు ఎర్రొల్ల సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

యువకుడిపై అత్యాచారం కేసు

ఖలీల్‌వాడి: నిర్మల్ జిల్లాకు చెందిన వాగేవార్ గౌతమ్(27)పై అత్యాచారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి సోమవారం తెలిపారు. వివరాలు.. ఈ నెల 17న భర్తతో గొడవపడి నిర్మల్‌కు వచ్చిన ఓ మహిళను సాయం చేస్తానని నమ్మించి గౌతమ్ నిజామాబాద్‌కు తీసుకొచ్చాడు. ఓ లాడ్జిలో ఆమెకు ఇష్టం లేకుండా శారీరకంగా లొంగదీసుకుని, నిర్మల్‌లో వదిలిపెట్టాడు. స్పృహ తప్పి పడి ఉన్న ఆమెను గమనించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిర్మల్ పోలీసులు కేసు నమోదు చేసి నిజామాబాద్ ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్‌కు పంపించారు.

మాజీ ప్రధానికి నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు, తదితరులు

సారంగపూర్: స్థానిక వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ఆవరణలో సోమవారం మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ సంస్మరణ సభ నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ హాదీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ మాట్లాడుతూ మన్మోహన్‌సింగ్ దేశానికి అందించిన సేవలను కొనియాడారు. విలాస్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, పోతారెడ్డి, నేరడిగొండ శ్రీనివాస్, మారుతి, నర్సారెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

'భూములు ఇప్పించి ఆదుకోండి'

భైంసాటౌన్: ఆర్‌అండ్‌ఆర్‌లో భాగంగా భూములు కోల్పోయిన తమకు ఇదివరకే కేటాయించిన భూములు ఇప్పించి ఆదుకోవాలని కుభీర్ మండలం నిగ్వా గ్రామస్తులు పలువురు కోరారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ఆర్డీవో కోమల్‌రెడ్డిని కలిసి విన్నవించారు. అనంతరం వారు మాట్లాడుతూ దాదాపు 18ఏళ్ల కిందట ఆర్‌అండ్‌ఆర్‌లో తాము పాక్షికంగా ఇళ్లు కోల్పోయామని, ఇందుకు అప్పట్లో ప్రభుత్వం పరిహారం అందజేసిందని, ఇళ్లు కట్టుకునేందుకు 30 ఎకరాల్లో స్థలం కేటాయించిందన్నారు. కానీ తమకు ఇళ్ల స్థలాలు చూపించలేదన్నారు. దీంతో పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లలోనే ఉంటున్నామని, సమస్య పరిష్కరించాలని ఆర్డీఓను కోరారు. గ్రామస్తులు దేవిదాస్, సరిత, లక్ష్మి, అర్చన, పోసాని, సుగుణ తదితరులు ఉన్నారు.

కేజీబీవీల తనిఖీ

కుంటాల/నర్సాపూర్(జి)/కుభీర్: కుంటాల మండలం కల్లూరు, నర్సాపూర్(జి), కుభీర్ మండల కేంద్రాల్లోని కస్తూర్బా గాంధీ పాఠశాలలను డీఈవో రామారావు సోమవారం తనిఖీ చేశారు. విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు డిజిటల్ పాఠాలు బోధించారు. ఎంఈవోలు ముత్యం, కిషన్‌రావు, రాజులదేవి విజయ్‌కుమార్, ఇన్‌చార్జి ఎస్‌వో మంజుల ఉన్నారు.

హామీని అమలు చేయాలి

నిర్మల్‌చైన్‌గేట్: వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేలు చెల్లిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఏవోకు వినతిపత్రం అందజేశారు. కూలీకి ఏడాది రూ.12 వేల అందించే ప్రక్రియకు సంబంధించి విధి విధానాలు రూపొందించడానికి వ్యవసాయ కార్మిక సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధి కూలీలే కాకుండా వ్యవసాయంలో పనిచేసే ఇతర కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇవ్వాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి నూతన్‌కుమార్, జిల్లా కమిటీ సభ్యుడు నారాయణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాగెల్లి నరసయ్య ఉన్నారు.

వాళ్లు మారరు..అధికారులు చూడరు..!

- భైంసాలో యథేచ్ఛగా ధాన్యం అక్రమ తరలింపు
- నిద్రమత్తులో సివిల్ సప్లయ్ అధికారులు



భైంసా నుంచి తరలేందుకు సిద్ధంగా ఉన్న ధాన్యం లారీలు

భైంసాటౌన్: ఓ వైపు ధాన్యం అక్రమ రవాణాపై ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. రైస్‌మిల్లులకు సీఎంఆర్ కోసం కేటాయించిన ధాన్యం అక్రమంగా తరలించినవారిపై కేసులు సైతం నమోదు చేస్తోంది. జిల్లాలో పదుల సంఖ్యలో రైస్‌మిల్లర్లు రూ.కోట్లలో ధాన్యం పక్కదారి పట్టించినట్లు అధికారులు తనిఖీల్లో గుర్తించారు. ఈమేరకు సదరు మిల్లులపై కేసులు సైతం నమోదు చేశారు. అయినా, కేసులకు వెరవకుండా కొందరు మిల్లర్లు ధాన్యం పక్కదారి పట్టిస్తూనే ఉన్నారు. గోదాముల నుంచి లారీల్లో ధాన్యం లోడ్ చేస్తూ ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. తనిఖీ చేయాల్సిన అధికారులు నిద్రమత్తు వీడడం లేదు. జిల్లావ్యాప్తంగా ప్రతిరోజు ఎక్కడో ఓ చోట ధాన్యం తరలుతున్నా.. పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో పలుమార్లు పట్టణంలోని గోదాముల నుంచి ధాన్యం తరలిపోగా, ఆదివారం రాత్రి సైతం పట్టణ శివారులోని భోకర్‌రోడ్డులో గల ఓ గోదాం నుంచి రెండు లారీల్లో ధాన్యం నిజామాబాద్‌కు తరలించినట్లు సమాచారం.

రాత్రివేళల్లో గుట్టుగా..

ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తోంది. ఈ ధాన్యాన్ని బియ్యం పట్టించేందుకు ప్రతిసీజన్‌లో సీఎంఆర్ కింద ధాన్యం కేటాయిస్తోంది. ఈమేరకు రైస్‌మిల్లుల్లో బియ్యం పట్టించి ప్రభుత్వానికి అప్పగించాలి. కానీ కొంతమంది రైస్‌మిల్లర్లు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన ధాన్యం దర్జాగా పక్కదారి పట్టిస్తున్నారు. రైతుల పేరిట నకిలీ వేబిల్లులు సృష్టిస్తూ అక్రమంగా అమ్ముకుంటున్నారు. పట్టించుకోవాల్సిన సివిల్ సప్లయ్ అధికారులు రాత్రివేళల్లో స్థానికంగా ఉండకపోవడంతో ఇష్టారీతిన తరలించుకుపోతున్నారు.

చర్యలు తీసుకుంటాం

సీఎంఆర్ కోసం కేటాయించిన ధాన్యం పక్కదారి పట్టిస్తే చర్యలు తీసుకుంటాం. భైంసా డివిజన్‌లో కొన్ని రైస్‌మిల్లులపై ఇప్పటికే కేసులు నమోదయ్యాయి.

– సీహెచ్ కోమల్‌రెడ్డి, ఆర్డీవో, భైంసా

న్యాయం చేయండి

- ఎస్పీకి వంశీకృష్ణ తల్లి వేడుకోలు



ఎస్పీని వేడుకుంటున్న వంశీకష్ణ తల్లి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని నాయుడివాడకు చెందిన కొర్తికంటి వంశీకృష్ణ ఈనెల 24న నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేశాడు. జిల్లా జనరల్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటూ.. 26న పరిస్థితి విషమించి మృతి చెందాడు. తన ఆత్మహత్యకు కారణాలపై సూసైడ్ నోట్ రాశాడు. వంశీకృష్ణ ఓ నర్సింగ్ హోమ్‌లో పార్టనర్‌గా ఉన్నాడు. ఈ క్రమంలో రెండు మెడికల్ ఏజెన్సీల నుంచి ఆస్పత్రి కోసం మందులు తీసుకున్నాడు. ఆస్పత్రి భాగస్వామితో గొడవ కావడంతో వంశీకృష్ణ హాస్పిటల్‌కి దూరంగా ఉన్నాడు. మెడికల్ కోసం తీసుకొచ్చిన ఏజెన్సీల బిల్లులను ఆసుపత్రి నుంచి చెల్లించలేదు. దీంతో మందులు ఇచ్చిన మెడికల్ ఏజెన్సీల నిర్వాహకులు ఆస్పత్రి నిర్వాహకులకు కాకుండా.. వంశీకృష్ణను అడుగుతూ. పలుమార్లు వేధించారు. దీంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయంపై ఆయన తల్లి జయ జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ఎస్పీ జానకీషర్మిలను సోమవారం కలిశారు. చనిపోయిన తన కొడుకుకు న్యాయం చేయాలని వేడుకున్నారు. తనకు జరిగిన అన్యాయాన్ని ఎస్పీకి వివరించారు. ఈ విషయంపై స్పందించిన ఎస్పీ.. వారిని పట్టుకోవడానికి రెండు స్పెషల్ టీంలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. త్వరలోనే వారు ఎక్కడ ఉన్నా అరెస్టు చేస్తామని భరోసా కల్పించారు. ఇందులో నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్, నాయుడివాడ కాలనీవాసులు పాల్గొన్నారు.

కుభీర్ మార్కెట్ చైర్మన్‌ను నియమించాలని ధర్నా



ధర్నా చేస్తున్న నాయకులు

కుభీర్: ఎస్సీలకు రిజర్వ్ చేసిన కుభీర్ మార్కెట్ చైర్మన్‌ను ప్రభుత్వం వెంటనే నియమించాలని దళిత సంఘాల ఆధ్వర్యంలో మార్కెట్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏడాదికాలంగా కుభీర్ మార్కెట్ చైర్మన్‌ను పదవికి ఎవరిని నియమించకపోవడం విడ్డూరమన్నారు. వెంటనే నియమించాలని లేకపోతే నిరాహార దీక్ష, రాస్తారోకోలు చేపడుతామని హెచ్చరించారు. మాజీ మార్కెట్ చైర్మన్ బి.విఠల్, దళిత నాయకుడు కొత్తూరు శంకర్, బీజేపీ నాయకులు గులాబ్, దత్తాత్రి, మాజీ సర్పంచులు బాబు, రమేశ్ పాల్గొన్నారు.

కళల ఖిల్లా.. నిర్మల్ జిల్లా..

- విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు లింగన్న



ఉత్తమ సేవాపురస్కార గ్రహీతలతో సంగీత అకాడమీ నిర్వాహకులు

నిర్మల్‌ఖిల్లా: జిల్లాలో కవులు, కళాకారులకు కొదువ లేదని, నిర్మల్ జిల్లా కళల ఖిల్లాగా పేరుగాంచినదని పలువురు వక్తలు కొనియాడారు. జిల్లా కేంద్రంలోని స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన పలువురికి ఉత్తమ సేవా పురస్కారాలు అందజేశారు. జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖనేత్ర వైద్యులు డాక్టర్ ఉప్పు కృష్ణంరాజు కంటి దవాఖాన వారి సౌజన్యంతోపాటు, మాప్రాణం సంగీత అకాడమీ వారిచే పురస్కారాలు అందించారు. ముఖ్యఅతిథిగా ఎంసీ లింగన్న హాజరై మాట్లాడారు. ప్రోత్సాహం అందిస్తే జిల్లా ఖ్యాతిని ప్రపంచస్థాయికి తీసుకెళ్లే సత్తా ఉందని, ముమ్ముందు ఇలాంటి అవార్డు కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. డాక్టర్ ఉప్పు కృష్ణంరాజు మాట్లాడుతూ.. వైద్యులను, న్యాయవాదులను, కవులను కళాకారులను ఈ విధంగా సన్మానించుకోవడం సంతోషంగా ఉందన్నారు. అమెరికాలో నివసిస్తూ పుట్టినగడ్డకు సేవచేయాలన్న ఆలోచనతో శాంతినికేతన్ వికలాంగుల పాఠశాలను నిర్వహిస్తున్న ఎన్ఆర్ఐ పన్నెల జనార్దన్‌ను కళారత్న పురస్కారంతో సత్కరించారు. డాక్టర్ వేణుగోపాలకృష్ణ, డాక్టర్ రామకృష్ణ, న్యాయవాది శుభకరన్, టీఎన్జీవోస్ అధ్యక్షుడు ప్రభాకర్, జానపద కళాకారుడు రేలారే రేలా రవి, నటులు యెర్ర రవి, మోహన్, శోభ, గోపి, పాటల రచయిత మనోహర్, కవియాత్ర అధ్యక్షుడు కారం శంకర్‌కు ఉత్తమ సేవా పురస్కారం అందించారు. కార్యక్రమంలో గురుస్వామి చెనిగారపు చిన్నయ్య, నిర్మల్ కళాసాహితీ అధ్యక్షుడు నవీద్ నూరాని, వేణువర్మ, రాజ్‌కుమార్‌వర్మ, చేనిగరపు నాగరాజు, శ్రీకాంత్ స్వామి, కవిత, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన న్యాయమూర్తిని కలిసిన ఏజీపీ



కర్ణకుమార్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఏజీపీ అసిఫ్ అలీ

నిర్మల్‌టౌన్/ఖానాపూర్: ఖానాపూర్ ఏజీపీగా ఇటీవల నియమితులైన ఆసిఫ్ అలీ జిల్లా కోర్టులో ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్, జూనియర్ సివిల్ జడ్జి ఆర్.అజయ్‌కుమార్‌లను సోమవారం మర్యాదపూర్వకంగా వేర్వేరుగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు. ఇందులో నిర్మల్ ఏజీపీ రాజ్ కుండే, న్యాయవాదులు శ్యాంసుందర్‌రెడ్డి, అశోక్, రమణారావు, రమణగౌడ్, ఖాజా తదితరులు ఉన్నారు.

'అమిత్ షాను కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలి'



నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్ష నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోంశాఖమంత్రి అమిత్ షాను కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని ట్యాంక్‌బండ్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహం ఎదుట సోమవారం నిరసన తెతెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్లమెంట్‌లో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక అమిత్ షా.. బీఆర్ అంబేడ్కర్‌ను అవహేళన చేస్తూ మాట్లాడారని అన్నారు. ఆయనపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు నంది రామయ్య, కె.రాజన్న, నూతన్‌కుమార్, జె.రాజు, విలాస్, అల్లూ పీటర్, ఎం.బక్కన్న, కె.లక్ష్మి, ఆర్.రామలక్ష్మణ్, ఎస్.గంగన్న, మహేందర్, ఎల్లన్న, సుంచుల నారాయణ, పోషలింగు, హరిత, రాజేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

సీఎం కప్ రాష్ట్రస్థాయి వుషూలో

జిల్లాకు బంగారు పతకాలు



పతకాలు సాధించిన క్రీడాకారులతో కోచ్‌లు

భైంసాటౌన్: సీఎం కప్ రాష్ట్రస్థాయి వుషూ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఈనెల 27 నుంచి 29 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచారు. మొత్తం 18 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొనగా, 8 మంది పతకాలు సాధించారు. వీరిలో ముగ్గురు బంగారు, ముగ్గురు వెండి పతకాలు సాధించగా, ఇద్దరు కాంస్య పతకాలు గెలుచుకున్నారు. ఈ మేరకు పతకాలతోపాటు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ తరఫున రూ.20 వేలు(గోల్డ్‌మెడల్), రూ.15వేలు(రజతం), రూ.10వేలు(కాంస్యం) బహుమతులు అందుకున్నట్లు కోచ్ శ్రీరాముల సాయికృష్ణ తెలిపారు.

పతకాలు సాధించిన క్రీడాకారులు...

సబ్ జూనియర్ బాలుర విభాగంలో అబ్దుల్ రహమాన్(24 కేజీలు), రాథోడ్ కృష్ణ(36 కేజీలు), బాలికల విభాగంలో ఎల్.మమత(36 కేజీలు) బంగారు పతకం సాధించారు. డి.రాజేశ్వరి(33 కేజీలు), కె.పల్లవి(48 కేజీలు), ఎస్.రుద్ర(21 కేజీలు) వెండి పతకాలు గెలుచుకున్నారు. శ్రేయన్ కార్తికేయ(30 కేజీలు), ఆర్.కల్యాణి(52 కేజీలు) కాంస్య పతకాలు సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులు, ఖేలో ఇండియా వుషూ కోచ్ జ్ఞానతేజ, కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీకాంత్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో మార్షల్ ఆర్ట్స్ కోచ్‌లు తేజేందర్‌సింగ్ భాటియా, శ్రీకాంత్, సాయినాథ్, మృణాళిని, శివరాజ్‌గౌడ్, రాజశ్రీ, నితిన్‌గౌడ్, అనూష, అనన్య, నగేశ్ పాలొన్నారు.

చెట్లు తొలగించిన వ్యక్తికి జరిమానా



జరిమానా విధిస్తున్న అనీస్

భైంసాటౌన్: పట్టణంలోని భవానీచౌక్ ప్రాంతంలో రోడ్డుకు పక్కన మున్సిపల్ ఆధ్వర్యంలో పెంచిన హరితహారం చెట్లను ఆదివారం నరికేసిన విషయం తెలిసిందే. దీంతో మున్సిపల్ అధికారులు స్పందించి విచారణ చేపట్టగా, మెడిప్లస్ మెడికల్ దుకాణదారు తన దుకాణానికి చెట్లు అడ్డంగా ఉన్నాయని తొలగించినట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనీస్ తెలిపారు. ఈ మేరకు కమిషనర్ రాజేశ్‌కుమార్ ఆదేశాల మేరకు సోమవారం దుకాణదారుకు రూ.10 వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

కేజీబీవీ ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించాలి

కడెం: కేజీబీవీ ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు భూక్యరాజేశ్‌నాయక్, ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం మాట్లాడారు. ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగుల తోటి వెట్టిచాకిరీ చేయిస్తోందని ఆరోపించారు. గతంలో ఇచ్చిన మాట ప్రకారం ఉద్యోగుల సర్వీసు రెగ్యులరైజ్ చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్న దృష్ట్యా విద్యార్థులపై సమ్మె ప్రభావం ఉంటుందని తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వం వెంటనే చొరవ చూపి సమస్య పరిష్కారమయ్యేలా ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాలని సూచించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు సాయన్న, అడెల్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భిక్షపతి నాయక్ ఉన్నారు.

'గుర్తింపుకార్డులు ఇవ్వాలి'

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో భవన నిర్మాణ కార్మికులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని సీపీఎం పట్టణ కమిటీ కార్యదర్శి తొడసం శంబు కోరారు. సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యాన జిల్లా కేంద్రంలోని కార్మిక శాఖ కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులు అందజేయడంలో ఆలస్యం జరుగుతోందన్నారు. వారి సమస్యల పరిష్కారానికి కార్మికశాఖ చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు రాము, భీమ్‌రావు, అర్జున్, మక్కు, రాము, బీరసావ్ పాల్గొన్నారు.

సివిల్ సప్లయ్ హమాలీల సమ్మె నోటీసు

ఖానాపూర్: పట్టణంలోని ఎంఎల్ఎస్ పాయింట్‌లో విధులు నిర్వహించే సివిల్ సప్లయ్ హమాలీలు తహసీల్దార్ శివరాజ్‌కు సోమవారం సమ్మె నోటీసు అందజేశారు. ప్రభుత్వం వెంటనే తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని లేకపోతే రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జనవరి 1 నుంచి నిరవధిక రిలే నిరాహార దీక్ష చేపడుతామన్నారు. హమాలీలు పిట్టల బీమేశ్, పిల్లి రమేశ్, చిన్నయ్య, భూమారెడ్డి, నర్సయ్య తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

పెండింగ్ కేసులు పరిష్కరించాలి

పెంబి: పెండింగ్ కేసులను వెంటనే పరిష్కరించాలని నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్‌ని ఖానాపూర్ సీఐ సైదారావుతో కలిసి సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి, పెండింగ్ కేసుల వివరాలను ఎస్‌హెచ్‌వో హన్మండ్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరాలపట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, బాధితులు పోలీసుస్టేషన్‌కు వస్తే న్యాయం జరిగేలా చూడాలన్నారు. పోలీసు సిబ్బంది భీమరాజు, రాజు ఉన్నారు.

శిఖం భూములు సర్వే చేయండి

లోకేశ్వరం: బామ్నికే గ్రామంలో ఆక్రమణకు గురవుతున్న శిఖం భూములను వెంటనే సర్వే చేయాలని గ్రామస్తులు లోకేశ్వరం తహసీల్దార్ మోతీరామ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. గ్రామంలో చుట్టూ శిఖం భూములను కొందరు అక్రమించుకున్నారని, వెంటనే సర్వే చేసి కాపాడాలని కోరారు.

ఆత్మరక్షణకు తైక్వాండో దోహదం

కుంటాల: ఆత్మరక్షణకు తైక్వాండో ఎంతో దోహదపడుతుందని శిక్షకుడు శ్రీనివాస్ పేర్కొన్నారు. కుంటాల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం తైక్వాండోపై శిక్షణ ఇచ్చారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం చంద్రనాగాకాంత్, ఉపాధ్యాయులు ఉన్నారు.

కేజీబీవీ సందర్శన

కడెం: మండల కేంద్రంలోని కేజీబీవీని సెక్టోరియల్ అధికారులు సలోమికరుణ, పద్మ సోమవారం సందర్శించారు. సిబ్బంది సమ్మెలో ఉండడంతో తరగతుల నిర్వహణను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల హాజరుశాతం, తరగతుల, మెనూ నిర్వహణ గురించి ఎంఈవో షేక్ హుస్సేన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన

భైంసారూరల్: కామోల్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. సర్వేపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యదర్శులు, గ్రామస్తులు ఉన్నారు.

బీజేపీ బూత్ కమిటీ ఎన్నిక

కుంటాల: బూత్‌స్థాయిలో బీజేపీని బలోపేతం చేసేందుకు కమిటీలను ఎన్నుకుంటున్నట్లు అసెంబ్లీ కోకన్వీనర్ సుమన్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని లింబా(బి) గ్రామంలో బూత్ కమిటీ కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. 59వ బూత్ అధ్యక్షుడిగా ముధోల్ల గజ్జారాం, సెక్రటరీగా ఆదుముల్ల శ్రీధర్ ఎన్నికయ్యారు. అనంతరం కార్యవర్గ సభ్యులను నాయకులు సన్మానించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి కేశెట్టి అశోక్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శి సూర్య వంశీసాయి, రవీందర్, నారాయణ, గంగుల రాజేశ్వర్, సాయిబాబా, చిన్నయ్య, సాయి,సునీల్, శివాజీ, ప్రశాంత్, శైలేష్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

తానూరు: నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రమేశ్ సూచించారు. మొగ్లి గ్రామంలో సోమవారం గ్రామస్తులకు నేరాలపై అవగాహన కల్పించారు. ఎవరైన గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్‌లో మెసేజ్ పంపి ఓటీపీలు చెప్పమన్న చెప్పవద్దని అన్నారు. పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

రైతుల అభ్యున్నతికి పాటుపడుతాం

కుంటాల: రైతుల అభ్యున్నతికి పాటుపడుతామని పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారాం పేర్కొన్నారు. కుంటాల సహకార సంఘ భవనంలో సోమవారం నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు సౌకర్యార్థం కోసం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలపై చర్చించారు. సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, సీఈవో నాగభూషణం, డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చింతల్‌పేట్‌ను పంచాయతీ చేయాలి

ఖానాపూర్: బాదనకుర్తి పంచాయతీ పరిధిలో గల చింతల్‌పేట్‌ను పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతూ హైదరాబాద్‌లో మంత్రి సీతక్కను ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సోమవారం కలిసి విన్నవించారు. ఇటీవల గ్రామస్తులు ఈ విషయమై తనకు విన్నవించారని మంత్రికి తెలిపారు. ఎంపీవో రత్నాకర్‌రావు, కార్యదర్శి సురేందర్ ద్వారా పంచాయతీ తీర్మానం ప్రతిపాదనలు మంత్రికి అందజేశారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

కుంటాల: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని టీఎస్ సీపీఎస్‌ఈయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం భూమన్న పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో జనవరి 5న నిర్వహించే 'పెన్షన్ ఆక్రోష్' కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను కుంటాల ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం ఆవిష్కరించారు. రేవంత్, సత్యనారాయణ పాల్గొన్నారు.

పరామర్శ

ముధోల్: తరోడాకు చెందిన బింగివార్ శేఖర్ నానమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మోహన్‌రావుపాటిల్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఎంపీపీ సుభాష్ జాదవ్‌పటేల్ ఉన్నారు.

విద్యార్థినులకు వైద్యపరీక్షలు

కుంటాల: కల్లూరు కేజీబీవీ విద్యార్థినులకు సోమవారం వైద్యురాలు శృతిరెడ్డి వైద్యపరీక్షలు నిర్వహించారు. పల్లె దవాఖాన వైద్యురాలు అమతయాని, ఏఎన్ఎం బబిత ఉన్నారు.

అన్నదానం

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గల నాగదేవత ఆలయం వద్ద అఖిల భారత అయ్యప్పదీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సమితి అధ్యక్షుడు కోటగిరి గోపి మాట్లాడుతూ జాతీయ అధ్యక్షుడు రాజు దేశ్ పాండే ఆదేశాలతో ప్రతి అమావాస్య రోజు అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆలయ కార్యవర్గం

ఖానాపూర్: పట్టణంలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా అజయ్, కోశాధికారిగా జగన్, ఉపాధ్యక్షుడిగా శ్రీపాద శేషాద్రి, సహాయకార్యదర్శిగా రాజశేఖర్ ఎన్నికయ్యారు.

ఎస్సారెస్పీ సందర్శన

కుంటాల: అందాకూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు సోమవారం క్షేత్రపర్యటనలో భాగంగా నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టును సందర్శించారు. హెచ్‌ఎం మానాజీగారి సిద్ధిరాం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

తానూరు: సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ ఉత్తర తెలంగాణ ఆధ్వర్యంలో మండలంలోని ఎల్వి జెడ్పీ పాఠశాల విద్యార్థులకు మాదకద్రవ్యాల నిర్మూలనపై సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అంతకుముందు గ్రామంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఎంఈవో నరేందర్, సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ ఇన్‌చార్జి చైర్మన్ సాప పండరి, వైస్ చైర్మన్ పెంటాజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్‌కు అనుమతి ఇవ్వాలి'

కుంటాల/లోకేశ్వరం/మామడ: తమ సమస్యల పరిష్కారం కోసం మంగళవారం తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ ఆశవర్కర్లు వైద్యురాలు శృతిరెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఆశవర్కర్ల మండల కన్వీనర్ ఇంద్రమాల, సభ్యులు పాల్గొన్నారు.

- లోకేశ్వరం మండల ఆశ కార్యకర్తలు సోమవారం పీహెచ్‌సీ వైద్యురాలు శైలజకు వినతిపత్రం అందజేశారు. మండల ఆశ కార్యకర్తల సంఘం అధ్యక్షురాలు ఆనందకుమారి ఉన్నారు.
- చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ మామడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశలు సోమవారం వైద్యాధికారికి వినతిపత్రం అందించారు.

'ఈద్గాపై విచారణ కమిటీ ఏర్పాటు చేయాలి'

నిర్మల్‌చైన్‌గేట్: సారంగాపూర్ మండలం చించోలి (బి) సమీపంలో నిర్మించిన (ఈద్గా)పై విచారణ కమిటీ ఏర్పాటు చేయాలని ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు హైదర్ కోరారు. జిల్లాకేంద్రంలోని సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సోమవారం ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హైదర్ మాట్లాడుతూ ఈద్గాను 2023 ఏప్రిల్ 18న ప్రారంభించారని, శిలాఫలకంలో రూ.5.35 కోట్లు ఉందన్నారు. ఈద్గా స్థలం కోసం 2021 డిసెంబర్ 31న నిర్మల్ మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం నుంచి తీర్మానం చేసి అటవీశాఖకు అందించారని మున్సిపల్ అధికారులు సమాచారం అందించారని తెలిపారు. ఈద్గా కోసం స్థలం కేటాయించలేదని, ఒకేషనల్ ట్రైనింగ్ అండ్ స్కిల్ అప్‌గ్రేడేషన్ సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదన అందినట్లు అటవీ అధికారులు చెబుతున్నారని తెలిపారు. అదనపు కలెక్టర్ వెంటనే విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.